సాక్షి
ఖమ్మం
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



రాజ్యాంగ విలువలకు తిలోదకాలు
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తోందని సీపీఐ నాయకుడు హేమంతరావు విమర్శించారు. 10లో



అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలి
డోర్నకల్ - మిర్యాలగూడెం రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని రైతులు ఎంపీ నామాకు విన్నవించారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశముంది.

ఇఫ్తార్
(గురువారం సా.)
6.31
సహర్
(శుక్రవారం ఉ.)
4.31
రంజాన్ వేళలు

ఆత్మీయంలో విషాదం

గుడిసెకు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) ప్రమాదానికి కారణమైన సిలిండర్



రోదిస్తున్న క్షతగాత్రులు, మృతుల బంధువులు



పేలుడు ఘటనతో చిన్నబోయిన చీమలపాడు
- ఓవైపు రక్తపు మడుగు.. మరోవైపు రోదనలు
- కనీవినీ ఎరుగని ప్రమాదంతో ఉలిక్కిపడిన గ్రామస్తులు
- పలువురి కాళ్లు తెగి.. రక్తసిక్తమైన ఘటనా స్థలి
- ముగ్గురు దుర్మరణం.. నలుగురికి తీవ్ర గాయాలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/ కారేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ అధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనాన్ని వైరా నియోజకవర్గం కారేపల్లి మండలం చీమలపాడులో బుధవారం ఏర్పాటుచేశారు. దీంతో స్థానిక నాయకులు బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు, తోరణాలతో అలంకరించారు. నేతలకు స్వాగతం పలుకుతూ డప్పు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించగా పండుగ వాతావరణం నెలకొంది. కానీ నిమిషాల వ్యవధిలోనే పరిస్థితి మారిపోయింది. భీతావహ వాతావరణం, క్షతగాత్రుల రోదనలు, బంధువుల ఆక్రందనలతో దద్దరిల్లింది. ఎక్కడ చూసినా రక్తపు మడుగులు, మాంసపు ముద్దలతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ శ్రేణులు పేల్చిన బాణాసంచా రవ్వలు గుడిసెపై పడి.. అందులోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటనకు దారితీసింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ఖమ్మం ఆస్పత్రికి తరలించాక ఇద్దరు మృతి చెందగా.. మరొకరు హైదరాబాద్ తీసుకెళ్తుండగా మరణించారు. ఇంకా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అందరూ రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు కావడం గమనార్హం.

కళకళలాడిన గ్రామం..

చీమలపాడులో 3,500 మందికి పైగా జనాభా ఉన్నారు. దీనికి సమీపంలో బాజుమల్లాయిగూడెం, పాటిమీదిగుంపు, రేలకాయలపల్లి, గేటురేలకాయలపల్లి, తవిసిబోడు, బోటితండా, మూడుతండా గ్రామాలున్నాయి. చీమలపాడులో బుధవారం సమ్మేళనం ఉండటం, చుట్టుపక్కల గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం జరగకపోవడంతో సుమారు 800 మందికి పైగా కార్యకర్తలు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక పార్టీ శ్రేణులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది.

ముంచిన బాణసంచా..

ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములు నాయక్ వస్తున్నారన్న సమాచారంతో స్థానిక నేతలు భారీగానే ఏర్పాట్లు చేశారు. సభా వేదికకు సమీపంలో ఉన్న చెరువు కట్ట వద్దకు ఎదురువెళ్లి మంగళ హారతులతో స్వాగతం పలికారు. మేళతాళాలతో సభావేదిక వద్దకు ఆహ్వానించారు. ముఖ్యనేతలు వాహనాలు దిగిన స్థలం నుంచి సభావేదిక వద్దకు 100 మీటర్ల పైన దూరం ఉంటుంది. కొద్ది నిముషాల్లోనే సభావేదిక వద్దకు చేరుకుంటుండగా కార్యకర్తలు భారీ ఎత్తున బాణా సంచా పేల్చారు. సభావేదికకు సమీపంలో ఉన్న ఓ పూరిగుడిసెపై బాణాసంచా రవ్వలు పడి మంటలు లేచాయి. అప్పటికే ముఖ్య అతిథులు అంతా సభావేదికపై కూర్చున్నారు. ఈ సమయంలోనే పూరిగుడిసె కాలుతుండగా.. సభలో వెనుక ఉన్న వారంతా మంటలు ఆర్పేందుకు వెళ్లారు. సమీపంలోని ట్యాంకర్‌ను తీసుకొచ్చి బిందెలు, బకెట్లతో నీటిని చల్లడం ప్రారంభించారు. ఇందులో కార్యకర్తలతోపాటు విలేకరులు, పోలీసులు కూడా ఉన్నారు. నిప్పంటుకున్న ఇంటి పక్క మరో ఇల్లు ఉండటంతో మంటలు వ్యాపించకుండా వీరంతా ప్రయత్నం చేశారు.

ఇంటి వారు లేకపోవడంతో..

సుమారు 50 మందికి పైగా మంటలు ఆర్పుతుండగా.. అప్పటికే వేదికపై నుంచి మైక్‌లో నేతలు మంటల వద్దకు వెళ్లొద్దంటూ వారించారు. గుడిసెలో గ్యాస్ సిలిండర్ ఉందంటూ మరి కొందరు కేకలు వేశారు. అయినా మంటలు ఆర్పేస్తామని, తద్వారా సిలిండర్ పేలదని భావించి ముందుకెళ్లినట్లు సమాచారం. కానీ పది నిమిషాల పాటు మంటలు ఎగిసిపడడంతో వేడికి సిలెండర్ పేలిపోయింది. నిప్పంటుకున్న ఇల్లు గ్రామానికి చెందిన రాజన్న రాములుది. ఆయన కుటుంబంతో సహా వారం క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు.

మరుభూమిని తలపించి..

మంటలు ఆర్పుతున్న సమయంలో ఒక్కసారిగా సిలిండర్ పేలి ముక్కలై సభలో ఉన్న జనాల వైపు దూసుకొచ్చింది. దీంతో మంటలు ఆర్పుతున్న వారితోపాటు సమీపంలో వారందరికీ సిలిండర్ ముక్కలు చక్రాల్లా కోసుకుంటూ కాళ్లను ఛిద్రం చేశాయి. దీంతో చెరువు కట్ట కూడలి అంతా ఒక్కసారిగా కకలావికలం అయింది. భారీ శబ్దం రాగా అందరూ పరుగులు తీశారు. కనురెప్ప పాటులో జరిగిన ఘటనతో ఏమైందంటూ మళ్లీ సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటి వరకు తమతో మాట్లాడి.. కలిసి ఉన్న వారు కాళ్లు, చేతులు రక్తమోడుతూ కదల్లేని స్థితిలో రక్తపు మడుగులో ఉండటం చూసి షాక్‌కు గురయ్యారు. తెగిపడిన మాంసపు ముద్దలు, కాళ్లు, కొంతమందికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. మాంసపు ముద్దలు కార్యకర్తలపై పడటంతోపాటు చెట్లు, గోడల మీద పడటం చూసిన వారంతా ఎంత పెద్ద ప్రమాదమోనని ఖిన్నులయ్యారు. మొత్తం మీద ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చీమలపాడు ఘటనలో మృతిచెందిన వారు
1. బానోత్ రమేష్ (39), స్టేషన్ చీమలపాడు
2. అజ్మీరా మంగు (38), చీమలపాడు
3. ధర్మసోతు లక్ష్మా (56), గేటు రేలకాయలపల్లి

తీవ్ర గాయాలైన వారు
1. సందీప్, చీమలపాడు మహారాష్ట్ర వలస కూలి (రెండు కాళ్లు పూర్తిగా పోయాయి)
2. దాసా నవీన్, ముస్తఫానగర్, ఖమ్మం, కారేపల్లి సీఐ డ్రైవర్ (కాలు పూర్తిగా తొలగించారు)
3. తేజావత్ భాస్కర్, తవిసిబోడు (ఒక కాలు తొలగించారు)
4. ఆంగోత్ రవికుమార్, వెంకిట్యా తండా (కాలు పూర్తిగా తీసేశారు)

స్వల్ప గాయాలైన వారు
1. తేళ్ల శ్రీనివాస్, జర్నలిస్ట్
2. బండి రామారావు, జర్నలిస్ట్
3. అజ్మీర్ హరిబాబు, మూడుతండా
4. నరాటి వెంకన్న, చీమలపాడు



మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే సండ్ర, రాములునాయక్

వారికి ప్రమాదం త్రుటిలో తప్పింది..

ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములు నాయక్‌కు కూడా ప్రమాదం త్రుటిలో తప్పిందని స్థానిక నేతలు తెలిపారు. మంటలు లేస్తున్న క్రమంలో వేదిక మీద కూర్చున్న నామా చూద్దాం పద అని ఎమ్మెల్యేతో అన్నారు. కార్యకర్తలు మంటలు ఆర్పుతున్నారని ఎమ్మెల్యే చెప్పడంతో ఆయన ఆగిపోయారు. ఈక్రమంలోనే సిలిండర్ సభావేదిక వైపు దూసుకొచ్చి.. కొద్దిదూరంలోనే పడిపోవడంతో వీరికి పెనుప్రమాదం తప్పినట్లయింది.

కన్నీటి సంద్రమైన గ్రామం..

అప్పటి వరకు కళకళలాడిన గ్రామం విషాద ఘటనతో ఒక్కసారిగా కన్నీటి సంద్రమైంది. తమ గ్రామానికి చెందిన వారు చనిపోవడంతోపాటు తీవ్ర గాయాలపాలు కావడంతో అందరూ అక్కడికి చేరుకున్నారు. మిన్నంటిన రోదనల నడుమ క్షతగాత్రులను అంబులెన్స్‌లు, ప్రైవేట్ వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చీమలపాడుతో పా టు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా గాయాలపాలైన వారిని చూసేందుకు భారీగా ఆస్పత్రికి తరలివచ్చారు. మృతులతో పాటు తీవ్ర గాయాల పాలైన వారికి చిన్న పిల్లలు ఉండటంతో వారి కుటుంబాలకు దిక్కు ఎవరంటూ ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించడం కనిపించింది.

నిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడిన ఎంపీ

చీమలపాడు ఘటనలో తీవ్రంగా గాయపడిన తేజావత్ భాస్కర్, ఆంగోత్ రవికుమార్, సందీప్‌ను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈమేరకు ఎంపీ నామ నాగేశ్వరరావు కూడా బుధవారం రాత్రి హైదరాబాద్ వెళ్లి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వైద్యులతో మాట్లాడి మెరుగైన అందించాలని సూచించారు.

ఎప్పుడేం జరిగిందంటే...
- **ఉదయం 8 గంటలు** : ఆత్మీయ సమ్మేళన సభా వేదిక సిద్ధం
- **9.00** : సమ్మేళనానికి పది గ్రామపంచాయతీల నుంచి కార్యకర్తలు వాహనాల్లో తరలివచ్చారు.
- **9.30** : వేదికపై తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ప్రదర్శన
- **10.30** : సభావేదిక వద్దకు వందల సంఖ్యలో చేరిన జనం
- **11.00** : సమ్మేళనానికి ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములునాయక్ వస్తున్నందున స్వాగతం పలికేందుకు చెరువు కట్ట కూడలికి చేరుకోవాలని మైక్ ద్వారా సూచన
- **11.20** : ఎంపీ, ఎమ్మెల్యే చెరువు కట్ట రోడ్డుపైకి చేరుకోగా మహిళా కార్యకర్తలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.
- **11.25 గంటలు** : బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉత్సాహంతో బాణాసంచా పేలుస్తుండగా ఎంపీ, ఎమ్మెల్యే మేళతాళాల నడుమ సభావేదిక వద్దకు వచ్చారు.
- **11.30** : సభావేదికపై నేతలు ఆశీనులు కాగానే.. నిప్పురవ్వలు గుడిసెపై పడి మంటలు చెలరేగాయి. దీంతో మంటలు ఆర్పేందుకు కార్యకర్తలు, పోలీసులు యత్నిస్తుండగా విలేకరులు ఫొటోలు తీయసాగారు.
- **11.35** : ట్యాంకర్ ద్వారా తీసుకొచ్చిన నీటిని బిందెలు, బకెట్లతో తీసుకెళ్తూ మంటలు ఆర్పేందుకు యత్నించారు.
- **11.40** : గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి శకలాలు, సిలిండర్ సభావేదిక వైపు దూసుకొచ్చాయి.
- **11.50** : పలువురికి తీవ్రగాయాలై శరీర భాగాలు విడిపోయి చెల్లాచెదురుగా పడిపోయారు.
- **12.00** : పోలీసు, ప్రైవేట్ వాహనాలు, అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఖమ్మం తరలించారు.
- **మధ్యాహ్నం ఒంటి గంట** : ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి, సంకల్ప ఆస్పత్రుల్లో క్షతగాత్రులను చేర్చారు.

– కారేపల్లి

వద్దన్నా.. వినరే...
- ఇష్టారాజ్యంగా బాణసంచా వినియోగం

జిల్లాలో అనుమతులు లేకుండానే బాణాసంచా మోత మోగుతోంది. పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు, రాజకీయ పార్టీల ప్రదర్శనల్లో టపాసులను విపరీతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుండగా.. బాణాసంచా పేలుళ్లతో భారీ ఎత్తున నష్టం జరుగుతోందని చీమలపాడు ఘటనతో వెల్లడైంది. వేసవిలో బాణాసంచా అమ్మకుండా నిషేధించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంలో అగ్నిమాపక శాఖ దృష్టి సారించకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇటీవల రాజకీయ పార్టీల సభలు, శుభకార్యాల్లో బాణసంచా వినియోగం పెరిగింది. మామూలు సమయాల్లో ఏమో కానీ వేసవిలో బాణసంచా అమ్మకాలను నియంత్రించాల్సిన అవసరం కనిపిస్తోంది.

వైద్యులు, సిబ్బంది సేవలు
చీమలపాడులో ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడడంతో వారిని అంబులెన్స్‌ల్లో జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వీరికి ఆర్‌ఎంఓ డాక్టర్ బి.శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందిని హుటాహుటిన కేటాయించి చికిత్స అందేలా చూశారు. తేజావత్ భాస్కర్, వలస కార్మికుడు సందీప్, ఆంగోత్ రవికుమార్ కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో శస్త్రచికిత్స నిర్వహించి కాళ్లు తొలగించారు. సర్జన్లు, అనస్తీషియన్లను అందుబాటులో ఉంచి కొన్ని గంటల్లోనే ఆపరేషన్లు పూర్తి చేయించడంతో మృతుల సంఖ్య పెరగకుండా కాపాడినట్లయింది.



మంగూకు సీపీఆర్ చేస్తున్న వైద్యులు

మృతుల బంధువులు ఫిర్యాదు ఇచ్చారు
సీపీ విష్ణు ఎస్.వారియర్

చీమలపాడు ఘటనకు సంబంధించి మృతి చెందిన వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీపీ విష్ణు ఎస్.వారియర్ 'సాక్షి'కి తెలిపారు. అగ్నిప్రమాదంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. అయితే, ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. ఇంకా ఏదైనా అంశం ఉందా అనేది దర్యాప్తులో తేలుతుందని ఆయన పేర్కొన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేయించాక కుటుంబ సభ్యులకు అప్పగించామని సీపీ తెలిపారు.

మృతదేహాలను అడ్డుకున్న గ్రామస్తులు
రూ.50 లక్షల పరిహారం, ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్

బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా చీమలపాడులో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన బానోతు రమేష్, అజ్మీరా మంగు మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బుధవారం రాత్రి అంబులెన్స్‌లో తరలించారు. అయితే, చీమలపాడు చెరువుకట్ట కూడలి వద్దకు మృతదేహాలతో వచ్చిన వాహనాలను గ్రామస్తులు, మృతుల బంధువులు అడ్డుకున్నారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాత్రి పొద్దుపోయినా వాహనాలను అక్కడే నిలిపి ఉంచగా.. గ్రామస్తులకు పోలీసులు సర్దిచెప్పినా ససేమిరా అన్నారు. దీంతో ఉద్యోగులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి అక్కడే వేచి ఉన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఓ, అధికారులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగియటంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోటుపాట్లు లేకుండా పరీక్షలు జరిగేలా సూచనలు చేసిన కలెక్టర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ధనతో పాటు రామకృష్ణ, పాపారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాయకల్ప బృందం



పీహెచ్‌సీ పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: మండలంలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కాయకల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం, ఎంసీహెచ్ జిల్లా ప్రాజెక్టు అధికారులు నీలోహన, సైదులు పీహెచ్‌సీని పరిశీలించి మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. అలాగే, కాన్పులగది, ల్యాబ్, ఓపీ విభాగం, మందుల విభాగం, ఇన్‌పేషెంట్ వార్డు, గార్డెనింగ్‌ను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సీతారాం, డాక్టర్ అవినాష్, సూపర్‌వైజర్లు నర్సింహారావు, అన్నమ్మ, విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్క్ పరీక్షకు 34మంది గైర్హాజరు
ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్‌లో బుధవారం బీఆర్క్ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్లుగా పరీక్ష జరిగింది. ఉదయం సెషన్‌కు 339మందిలో గాను 332మంది హాజరు కాగా ఏడుగురు, మధ్యాహ్నం సెషన్‌కు 201మంది విద్యార్థుల్లో 174 మంది హాజరు కాగా 27మంది గైర్హాజరైనట్లు పరీక్షల సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు.

స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్డీఓ విద్యాచందన

రఘునాథపాలెం: అన్ని గ్రామాలను స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దుకోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. రఘునాథపాలెంలోని రైతు వేదికలో స్వచ్ఛభారత్ మిషన్‌పై బుధవారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. పల్లెప్రగతి కార్యక్రమాలతో గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలుగా మారగా.. స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్-2 ద్వారా మరుగుదొడ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వ సంస్థల్లో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీపీ భుక్యా గౌరి, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్బీఎం కన్సల్టెంట్లు అనూప్, జక్రియా, డీఆర్డీఏ ఏపీడీ వెంకటరాజుతో పాటు గుత్తా రవి, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎఫ్‌డీఓగా బాబు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఫారెస్ట్ డివిజనల్ అధికారిగా భూక్యా బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎఫ్‌డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ప్రకాశ్‌రావును యాదాద్రి భువనగిరి జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో భద్రాచలం ఎఫ్‌డీఓగా ఉన్న బాబు వచ్చారు.

ఓటర్ల జాబితాపై పునఃపరిశీలన
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించాక ధృవీకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఫొటో సిమిలర్ ఎంట్రీ(పీఎస్‌ఈ)లో మొదటి విడతగా తొలగించిన ఓటర్ల వివరాలు మరోసారి పరిశీలించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులుగా ప్రైవేట్ వ్యక్తులు ఉంటే తొలగించి ప్రభుత్వ సిబ్బందిని నియమించాలని చెప్పారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ గౌతమ్ పలు సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దశరథం, ఆర్డీఓ సూర్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అదనపు కలెక్టర్ మధుసూదన్

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 16,639 మందికి రెండో విడతలో గొర్రెలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఇందుకోసం లబ్ధిదారుల వాటా నగదు జమ చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్‌వేణుమనోహర్, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ భానుచౌదరి, డాక్టర్ రమణి పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిపై సమీక్ష

హైదరాబాద్‌లో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గానికి 300మందిని తీసుకురా వా లని సీఎస్ శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడగా కలెక్టర్ గౌతమ్ వివరాలు వెల్లడించారు. ఆతర్వాత ఆయన జిల్లాలో జయంతి ఏర్పాట్లపై సమీక్షించారు. అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక, ఆర్‌ఎం ప్రభులత, సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ, ఆర్డీఓ కిషన్‌రావు పాల్గొన్నారు.

తేలిన పంట నష్టం లెక్క
- జిల్లాలో 23,632 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలకు జిల్లాలో రైతులు నష్టపోయిన పంటల లెక్క తేలింది. జిల్లాలోని 21 మండలాల్లో 18,478 మంది సాగుదారులకు చెందిన 23,632.17 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ సర్వే ఆధారంగా గుర్తించింది. ఈమేరకు నివేదికను కలెక్టర్ వీ.పీ. గౌతమ్ అనుమతితో రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులకు పంపించినట్లు డీఏఓ ఎం.విజయనిర్మల తెలిపారు. గత నెల 17 నుంచి 20వ తేదీ వరకు ద్రోణి కారణంగా జిల్లాలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు, వడగండ్ల వానలు కురిశాయి. దీంతో కోత దశలో ఉన్న మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో పెసర పంటకు కూడా నష్టం వాటిల్లింది. తొలుత పంట నష్టంపై వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక రూపొందించగా.. జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. దీంతోనిబంధనల మేరకు సర్వే నిర్వహించి కలెక్టర్ పర్యవేక్షణలో నివేదిక రూపొందించారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో ఎక్కువగా వైరా, కొణిజర్ల, ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాల్లో పంట నష్టం జరిగినట్లు చెబుతుండగా.. త్వరలోనే రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం జమ అయ్యే అవకాశముంది.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీ, పోస్టింగ్

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలో ఒక సీఐని బదిలీ చేయగా.. ఇంకో ఇద్దరికి పోస్టింగ్ కేటాయించారు. ఈమేరకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేకెన్సీలో ఉన్న సీఐ చిట్టిబాబును ఖమ్మం సీఎస్‌బీకి కేటాయించారు. అలాగే, ఖమ్మం సీసీఆర్‌బీలో విధులు నిర్వర్తిస్తున్న తుమ్మ గోపిని మెదక్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఇక కొత్తగూడెం సీసీఎస్–2 సీఐగా బెల్లం సత్యనారాయణను నియమించారు.

తిరుమలాయపాలెంలో అండర్ టన్నెల్?

ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్ట్ 16వ ప్యాకేజీలో భాగంగా తిరుమలాయపాలెం మండలం పరిధిలో అండర్ టన్నెల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశముంది. టన్నెల్ నిర్మాణంతో రైతుల నుండి తక్కువ మొత్తంలో భూమి సేకరిస్తే సరిపోతుందని సమాచారం. దీనికితోడు ఇతర పనులు తగ్గడంతో రూ.200 కోట్లకు పైగా ఆదా అవుతాయని తెలిసింది. డీప్ కట్ కాల్వ నిర్మాణం కాకుండా సొరంగ మార్గం కాల్వ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించగా ఆమోదించిన ప్రభుత్వం త్వరలోనే జీఓ విడుదల చేయనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


కంభం సునీల్ (ఫైల్)

మధిర: పొట్టకూటి కోసం షాపులో పనిచేస్తున్న యువకుడు విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందగా.. ఆయన బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాలు... మండలంలోని అంబారుపేటకు చెందిన కంభం సునీల్(22) స్థానికంగా చెప్పుల దుకాణంలో పనిచేస్తున్నాడు. బుధవారం ఆయన సెల్‌ఫోన్ మాట్లాడుతూ దుకాణం పైకి వెళ్లగా పక్కనే ఉన్న 11కేవీ వైర్లు తాకడంతో స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో ఆయనను దుకాణ యజమాని, తదితరులు 108లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, సునీల్ కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆయన బంధువులు, గ్రామస్తులు షాపు ఎదుట మృతదేహంతో నిరసన తెలిపారు. ఈమేరకు సీఐ వడ్డేపల్లి మురళి చేరుకుని కేసు నమోదు చేశామని పేర్కొంటూ, వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండలంలోని మాధాపురానికి చెందిన హమాలీ మేస్త్రి పడిశాల ప్రసాద్(35) ఈనెల 10న మరికొందరితో కలిసి వాహనంలో కట్టకూరు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తున్నారు. మాదాపురం సమీపాన మూలమలుపు వద్ద డ్రైవర్ అతివేగంగా వాహనం నడపడంతో వెనుక నిలబడి ఉన్న ప్రసాద్ కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు ఖమ్మంలో చికిత్స హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం అనంతరం మంగళవారం రాత్రి ఖమ్మం తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత

ధర్నాకు దిగిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు

- ఎమ్మెల్యే రాములునాయక్‌ను అడ్డుకునేందుకు బాధితుల యత్నం
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఇతర పార్టీల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంక్రైం/ఖమ్మంవైద్యవిభాగం: కారేపల్లి మండలం చీమలపాడు ఘటనలో క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈమేరకు మృతి చెందిన వారి కుటుంబాలతో పాటు క్షతగాత్రులను పరామర్శించేందుకు కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్ టీపీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీవైఎల్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నేతలు ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తుండగా పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. అయినా నాయకులు వినకపోవడంతో కాంగ్రెస్, బీఎస్పీ నేతలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పరామర్శించిన నేతలు, అధికారులు

ఘటనలో గాయపడిన వారిని ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులు పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్ వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే, సీపీ విష్ణు ఎస్.వారియర్ కూడా ఆస్పత్రికి చేరుకుని ఆరా తీశారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, నాయకులు బానోతు విజయాబాయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్రా ఉపేందర్ సాహు, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడిపల్లి కవిత, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు క్షతగాత్రులను పరామర్శించి, బాధితులకు భరోసా కల్పించారు.


కాంగ్రెస్ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మిన్నంటిన రోదనలు

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఘటనలో గాయపడిన వారిలో కొందరిని ఆపరేషన్ థియేటర్‌లో, ఇతర విభాగాల్లో మరికొందరిని ఉంచి వైద్యం అందిస్తుండగా అక్కడకు వచ్చిన బంధువులు తమ వారెక్కడ ఉన్నారో తెలియక ఆందోళనకు గురయ్యారు. వలస కార్మికుడు సందీప్ భార్య మమీన్, అంగోత్ రవికుమార్ భార్య శైలజ, భాస్కర్ భార్య స్వప్న రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయారు.

మృతదేహల తరలింపు

క్షతగాత్రులను పరామర్శించేందుకు సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్ ఆస్పత్రికి వచ్చారు. అప్పటికే మరణించిన రమేష్, మంగు మృతదేహాలను చీమలపాడుకు తరలించే ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐసీయూలో ఉన్న సందీప్, భాస్కర్‌ను పరామర్శించారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే, ఘటనకు రాష్ట్రప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్యే రాములు నాయక్ అడ్డగింత

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఎమ్మెల్యే రాములు నాయక్ క్షతగాత్రులను పరామర్శించేందుకు ఆస్పత్రికి రాగా.. బాధిత కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఐసీయూ నుండి బయటకు వస్తున్న రాములునాయక్‌ను ఆందోళనకారులు అడ్డుకుంటారని తెలియడంతో ఆయన ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి మరో మార్గంలో బయటకు వచ్చారు. అక్కడ కొందరు మహిళలు ఎమ్మెల్యే రాములునాయక్‌ను అడ్డగించి తమ కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను పంపించారు.

దూషించి పార్టీలో ఎలా చేర్చుకున్నారు?

- మా అజెండా బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడమే..
- స్పష్టం చేసిన మాజీ ఎంపీ పొంగులేటి వర్గీయులు

ఖమ్మంమయూరిసెంటర్: నాడు పొగిడి నేడు తిడుతున్నారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని విమర్శిస్తున్న వారు.. 2018లో శాసనసభ ఎన్నికల సమయాన ఎంపీ నామాను ఇంటి పేరుతో దూషించిన సీఎం కేసీఆర్ తిరిగి ఆయనను పార్టీలో చేర్చుకుని సీటు ఇచ్చిన విషయాన్ని మరిచిపోయారా అని శ్రీనివాసరెడ్డి వర్గీయులు ప్రశ్నించారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం మువ్వా విజయబాబు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, డాక్టర్ కోటా రాంబాబు, మలీదు జగన్ విలేకరులతో మాట్లాడుతూ తమ జెండా, అజెండా బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడమేనని స్పష్టం చేశారు. శ్రీనివాసరెడ్డి స్కూటర్‌పై తిరిగిన విషయాన్ని ఆయనే చెబుతారని.. ఈ స్థాయికి ఎలా ఎదిగారో ప్రజలకు తెలుసునన్నారు. రైతు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి వేతనాలు తదితర అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కొత్తగూడెం సమ్మేళనానికి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు రావడంతో పార్టీ వ్యతిరేకులను ఐక్యం చేస్తారనే భయంతో సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తమ్ముడిని సర్పంచ్‌గా గెలిపించుకోలేని కమల్‌రాజ్‌కు తమను విమర్శించే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, నాయకులు మందడపు తిరుమలరావు, దుంపల రవికుమార్, మియాబాయ్, కొప్పెర ఉపేందర్, ధరావత్ రామ్మూర్తి నాయక్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మువ్వా విజయబాబు

■ మృతుల నేపథ్యం

01) బానోతు రమేష్ (40)
భార్య జ్యోతి, కూతురు శైలజ (డిగ్రీ ఫస్ట్ ఇయర్), కుమారుడు సాయి (ఇంటర్). రెండు ఎకరాలు పోడు చేస్తూ వ్యవసాయ కూలీలుగా ఉన్నారు.

02) అజ్మీరా మంగూ (56)
భార్య ..లలిత
ఇద్దరు కుమారులు.. ఉమష్, గణేష్ లు ఇంటర్ వరకు చదివి కూలీ పనికి వెళుతున్నారు. వ్యవసాయ భూమి లేదు.

03) ధరంసోతు లక్ష్మ (56)
భార్య : సరోజ, నలుగురు ఆడ పిల్లలు ఉన్నారు. ఇద్దరి వివాహం కాగా, మరో ఇద్దరు చదువుకుంటున్నారు. మూడు ఎకరాల పోడు భూమి ఉంది.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

తృటిలో బయటపడ్డాం..


గన్‌మెన్ నరేందర్


హోంగార్డు శంకర్

ఖమ్మంక్రైం: సినిమాల్లో మాదిరి గ్యాస్ సిలిండర్ గాలిలో ఎగురుతూ వచ్చింది. దీంతోపక్కకు దూకడంతో భారీ విస్ఫోటనం వినిపించింది. కొద్దిసేపటి వరకు చెవులు సరిగ్గా వినిపించలేదు. పక్కన చూస్తే కారేపల్లి సీఐ డ్రైవర్ అయిన నవీన్‌తోపాటు మరి కొంత మంది రక్తపు మడుగులో కనపడ్డారని సీఐ గన్‌మెన్ నరేందర్, హోంగార్డు శంకర్ వెల్లడించారు. తాము పక్కకు తప్పుకోకపోతే సిలిండర్ శకలాలు తమపై పడేవారని తెలిపారు.

■ దుఃఖాన్ని దిగమింగుతూ భర్తకు ధైర్యం చెబుతూ...

తన భర్త తీవ్రంగా గాయపడ్డాడని తెలుసుకుని కుమారుడు యశ్వంత్‌తో ఆస్పత్రికి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ భార్య గాయత్రి వచ్చారు. అప్పటికే నవీన్‌కు చికిత్స చేస్తుండగా బయట ఉన్న పోలీస్ సిబ్బంది ఆమెకు ధైర్యం చెప్పారు. అసలే నవీన్ భయపడుతున్నందున తన ముందే ఏడవొద్దని సూచించారు. దీంతో ఆమె దుఖాన్ని దిగమింగుకుంటూ ఫోన్‌లో నవీన్‌కు ధైర్యం చెప్పి ఒక్కసారిగా బంధువులపై పడి రోదించింది.

■ కాలు కోల్పోయిన నవీన్


భర్తకు ధైర్యం చెబుతున్న నవీన్ భార్య గాయత్రి

చీమలపాడులో ఆత్మీయ సమ్మేళనం ఉందంటూ త్వరగా విధులకు బయలుదేరిన నవీన్ కారేపల్లి వెళ్లి సీఐని ఎక్కించుకుని బయలుదేరాడు. గుడిసెకు మంటలు అంటుకోగా ఆర్పడానికి వెళ్లిన ఆయన కాలును సిలిండర్ శకలాలు తాకడంతో తీవ్రం గాయాలయ్యాయి. దీంతో ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించాలని భావించినా బీపీ తగ్గిపోతుండటంతో సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆస్పతి వైద్యులు, నవీన్ కుటుంబసభ్యులతో మాట్లాడి సంకల్ప ఆస్పత్రిలోనే చికిత్స చేయించారు. గాయం తీవ్రత కారణంగా ఆయన కాలు తీసివేయాల్సి వచ్చింది.

■ క్షతగాత్రులకు సీపీ పరామర్శ


నవీన్‌కు ధైర్యం చెబుతున్న సీపీ వారియర్

చీమలపాడులో పేలుడు అనంతరం క్షతగాత్రులను ఖమ్మంకు తీసుకురాగా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు సంకల్ప ఆస్పత్రిలో వారిని సీపీ విష్ణు ఎస్.వారియర్ పరామర్శించారు. ఏఆర్ కానిస్టేబుల్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బందిని పరామర్శించి వివరాలు ఆరా తీశారు. ఆయన వెంట ట్రెయినీ ఐపీయస్ అవినాష్ కుమార్, ఏసీపీలు ప్రసన్నకుమార్, రామోజీ రమేష్ తదితరులు ఉన్నారు.

■ సార్ నన్ను బ్రతికించండి..

'సార్ నన్ను బ్రతికించండి.. నొప్పి భరించలేకపోతున్నా.. రక్తం కారిపోతుంది.. ప్లీజ్ సార్ నాకేమైనా అయితే నా భార్య, కొడుకు అనాథలు అవుతారు' ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ ఆర్ఐ శ్రీనివాస్‌తో అంటుండగా అందరి కళ్లు చెమర్చాయి. నవీన్‌ను ఖమ్మం తీసుకొస్తుండగా అప్పటికే ఆస్పత్రికి వచ్చిన ఆర్ఐ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. 'నవీన్ నీకేం కాదు.. సీపీ విష్ణు ఎస్.వారియర్‌తోపాటు మేమంతా అండగా ఉన్నాం.. నిన్ను కాపాడుకుంటాం..' అంటూ ఆస్పత్రికి వచ్చే వరకు ఫోన్‌లో ధైర్యం చెప్పారు.


ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పర్యవేక్షిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల


ఆస్పత్రిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు


క్షతగాత్రుల బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్


ఆస్పత్రిలో రోదిస్తున్న క్షతగాత్రుల బంధువులు

తేరుకునేలోపే రక్తమోడారు..

- పేలుడు శబ్దం తర్వాత ఏం జరిగిందో తెలియదు..
- కళ్ల ముందే అందరూ గాయాలతో కూలబడ్డారు
- 'సాక్షి'తో చీమలపాడు దుర్ఘటన ప్రత్యక్ష సాక్షులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం / కారేపల్లి/ ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంక్రైం: 'మంటలు ఆర్పుతున్న వారు మా కళ్ల ముందే కనిపించారు. సభా ప్రాంగణానికి భోజనాల నిమిత్తం తీసుకొని వచ్చిన తాగునీటి ట్యాంకర్ నీటిని బిందెలు, బకెట్లలో పట్టి పూరిగుడిసెపై పోస్తున్నారు. అప్పటికే ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉంది జాగ్రత్త అంటూ కొందరు మంటలార్పుతున్న వారిని వారిస్తూనే ఉన్నారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు. ఒక్కసారిగా భారీ పేలుడు శబ్దం వచ్చింది.. అందరం ఉరుకులు పరుగులు పెట్టాం. రెప్పపాటులో చూసే సరికి కొందరు గాయపడి మోకాళ్లు పగిలి కూలపడ్డారు. సభ వేదిక వద్ద ఉన్నవారంతా గాయపడిన వారిని చూస్తూ నిశ్చేష్టులైపోయారు'. అంటూ చీమలపాడు అగ్నిప్రమాద దుర్ఘటనను నేరుగా చూసిన వారు..క్షతగాత్రులు ఘటన జరిగిన తీరును 'సాక్షి'కి వివరించారు.

ఐదు నిమిషాల్లోనే ప్రమాదం..



ఇంటి మంటలు ఆర్పుతూ పక్కకు వ్యాపించకుండా ప్రయత్నించారు. గుడిసెలో గ్యాస్ బండ ఉంది జాగ్రత్త అని కొందరు చెప్పారు. మంటలు ఆరిన ఐదు నిముషాల్లోనే గ్యాస్ బండ జనాల వైపు దూసుకొచ్చింది. నీళ్లు పోసే వారు పది మంది ఉంటే.. చూసే వాళ్లు ఎక్కువగా ఉన్నారు. సిలిండర్ కింద నుంచి దూసుకురావడంతో అందరికీ కాళ్లకే గాయాలయ్యాయి. – పి.రామారావు, ఎస్సై, కారేపల్లి

ఇల్లు కాలి ప్రమాదం..



మీటింగ్ దగ్గర ఒక ఇల్లు కాలుతోంది. కొందరు వెళ్లి మంటలు ఆర్పిన్రు. ఆ తర్వాత ఒక్కసారిగా పేలిన శబ్దం వినిపించింది. ఏం జరిగిందో తెలియదు. చాలామందికి గాయాలయ్యాయి. మా బంధువుల కూడా గాయపడ్డారు. అందరం పార్టీ కార్యక్రమంలో సంతోషంగా ఉండగా.. విషాదం జరిగింది. ఇలా అవుతుందని ఊహించలేదు.
– మాలోతు కిషోర్, సర్పంచ్, చీమలపాడు

ఇంకో ఇంటికి అంటుకోవద్దని..




నేను మరో రిపోర్టర్ కుమార్‌తో కలిసి కవరేజీకి వెళ్లాం. వేదిక సమీపాన ఇంటిపై ఇంటిపై క్రాకర్స్ పడి మంటలు లేవగా ఆర్పడానికి ప్రయత్నించారు. ఇందులో కుమార్ ఉన్నాడు. నేను పక్కనే నిల్చున్నా. పక్కనే ఉన్న ఇంటికి మంటలు రాకుండా యత్నించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా సిలెండర్ దూసుకురావడంతో కుమార్‌తో పాటు నాకు గాయాలయ్యాయి. – తేళ్ల శ్రీనివాస్, జర్నలిస్ట్

గుడిసెల సమీపాన బాణాసంచా



బీఆర్ఎస్ కార్యకర్తలు గుడిసెల సమీపాన బాణాసంచా పేల్చారు. దీంతో రవ్వలు గుడిసెపై పడి మంటలు లేచాయి. అందులో ఉన్న గ్యాస్ సిలెండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మంటలు ఆర్పే క్రమంలో గుడిసెలో సిలిండర్ ఉందని కొందరు అరిచారు. అయినా పక్క గుడిసెకు నిప్పు అంటుకోవద్దనే ఆర్పుతుండగా ఈ దారుణం జరిగింది.
– మాలోతు రాంకోటి, చీమలపాడు

రెప్పపాటులో ఘోరం జరిగింది..



గుడిసెకు నిప్పంటుకోవడంతో కొందరు ఆర్పే ప్రయత్నం చేశారు. నేను అక్కడే చూస్తున్నాను. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలి రెప్పపాటులో ఘోరం జరిగింది. ఇనుప ముక్క వచ్చి నా కుడిచేతికి తగిలి గాయమైంది. ఏం జరిగిందో ఆలోచిస్తుండగానే గాయమైన చేతి నుంచి రక్తం కారుతూనే ఉంది. దీంతో అక్కడి నుంచి నేను దూరంగా పరుగు తీశాను.
– అజ్మీరా హరిబాబు, మూడ్‌తండా, క్షతగాత్రుడు

పక్కన కూర్చుని చూస్తున్నాం..



సభ కోసం అందరం కలిసి వెళ్లాం. మామయ్య, నేను, మరి కొంత మంది సభా ప్రాంగణం వద్ద ఓ పక్కకు నిలుచుని ఉన్నాం. నా పక్కనే ఉన్న మామయ్యకు గాయాలు అయి కిందపడ్డాడు. ఏమైందో కూడా అర్థం కాలేదు. అందరం షాక్‌కు గురయ్యాం. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత రమేష్ చనిపోయాడని అన్నారు. ఏమీ తోచడం లేదు. – ప్రకాశ్‌రావు, మృతుడు రమేష్ మేనల్లుడు

చూస్తుండగానే జరిగిపోయింది..



మంటలు వచ్చాయన్నారు.. వాటిని అర్పుతున్నారన్నారు.. అది చూస్తుండగానే గాయాలతో రక్తమోడుతూ పలువురు గాయాలు పాలయ్యారు. నా సోదరుడు కాళ్లకు గాయమైంది. ఖమ్మం తరలిస్తున్నారని చెప్పారు. వచ్చి చూసేలోగా చనిపోయాడన్నారు. కళ్ల ముందు ఈ సంఘటన కలిచివేసింది. కుటుంబ సభ్యులను ఎలా ఓదార్చాలో తెలియడం లేదు.
– అజ్మీరా వాసు, మృతుడు మంగు సోదరుడు

మీటింగ్‌కు పోయి వస్తానన్నాడు



చీమలపాడు మీటింగ్‌కు పోయి అర్ధగంటలో వస్తానని చెప్పాడు. గ్యాస్ సిలెండర్ పేలి అందరికీ దెబ్బలు తగిలినట్లు మీటింగ్‌కు వెళ్లిన వాళ్లు చెప్పారు. మా పిల్లలను తీసుకుని వెంటనే ఆస్పత్రికి వచ్చిన. కాలికి పెద్ద దెబ్బ తగిలి రక్తం అంతా పోయింది. ఏం కాదులే అని డాక్టర్లు చెప్పారు. కానీ మా ఆయన చేతికి అందకుండా పోయిండు. ఆయన లేకుండా మేమెట్లా బతకాలి.
– దర్మసోత్ సరోజ, లక్ష్మా భార్య

పొట్టకూటికొచ్చి.. జీవచ్ఛవంలా

- రెండు కాళ్లూ కోల్పోయిన వలస కార్మికుడు
- కలచివేసిన సందీప్ భార్య మమీన్ రోదనలు
- ప్రేమ వివాహం చేసుకుని మహారాష్ట్ర నుంచి వచ్చిన కుటుంబం..


సొమ్మసిల్లిపడిపోయిన సందీప్ భార్య మమీన్

ఖమ్మంమయూరిసెంటర్: పొట్ట కూటి కోసం పుట్టిన ఊరు వీడి కారేపల్లి మండలం చీమలపాడుకు గ్రామానికి భార్య, కుమారుడితో కలిసి ఏడాది క్రితం సందీప్ వలస వచ్చాడు. చీమలపాడులో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. సుతారి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్న సందీప్ బుధవారం బీఆర్ఎస్ సభ వద్దకు వెళ్లాడు. సిలిండర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, భార్య తప్ప బంధులెవరూ లేకపోవడంతో రెండు కాళ్లు తొలగించాల్సిన విషయాన్ని వైద్యులు గ్రామ సర్పంచ్, ఇతర పెద్దలకు తెలిపారు. ఆతర్వాత తప్పనిసరి కావడంతో ఆయన కాళ్లు తొలగించారు.

ప్రేమ వివాహం చేసుకుని..

మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన సందీప్ ఒడిశాకు చెందిన మమీన్‌ను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో మమీన్‌ను కుటుంబ సభ్యులు దూరం పెట్టగా, అక్కడ ఉపాధి లేకపోవడంతో భార్య, మూడేళ్ల కుమారుడు కృష్ణను తీసుకొని చీమలపాడు వచ్చాడు. భార్యకు ఒక కన్ను సక్రమంగా కనపడకపోవడంతో ఆమె ఇంటి వద్దే ఉండేది.

కలచివేసిన మమీన్ రోదనలు..

ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించేందుకు, చూసేందుకు బంధువులతో పాటు పలువురు వచ్చి వెళ్తుండగా.. వారిని చూసిన మమీన్ కుమిలిపోయింది. తన భర్తకు ఏమైందో తెలియడం లేదని, తమను ఆదుకోవాలని ప్రతి ఒక్కరి కాళ్లపై పడి వేడుకుంటూ రోదించింది. ఆమె విలపిస్తున్న తీరు అక్కడున్నవారిని కలచివేసింది. ఒక దశలో ఆమె స్పృహ కోల్పోవడంతో వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రులను చూసేందుకు ఆస్పత్రికి వచ్చిన ఎమ్మెల్యే రాములు నాయక్ కాళ్లపై పడి తమను ఆదుకోవాలని వేడుకొంది. మమీన్‌కు ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆర్థిక సాయం చేశారు.

తిండి కోసం వలస వచ్చాం..

ప్రేమ వివాహం చేసుకున్న మాకు అక్కడ ఉపాధి లేక జీవనం సాగించేందుకు, తిండి కోసం చీమలపాడు వలస వచ్చాం. మాకు ఎవరూ లేరు. నాకు కొడుకు, భర్తే దిక్కు. ఆయన పని చేసుకొని వస్తేనే మాకు తిండి ఉంటుంది. ఇప్పుడు ఆయన కాళ్లు తొలగించడంతో పరిస్థితి అర్థం కావడం లేదు.
– మమీన్, సందీప్ భార్య

'చెక్కు'తో చిక్కారు!

ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు చూపిస్తున్న మార్గదర్శి

- బ్యాలన్స్ షీట్‌లో కనిపించిన చెక్కులు 90 రోజులు దాటినా నగదుగా మారని వైనం
- దారి మళ్లించిన రామోజీ.. రికార్డులు పరిశీలించేందుకు సమ్మతించని శైలజా కిరణ్
- తాజాగా ప్రధాన కార్యాలయంలో సీఐడీ విస్తృత సోదాలు.. అసలు చెక్కులు వచ్చిందీ లేదు.. నగదుగా మార్చిందీ లేదు
- మరో రూ.500 కోట్లు ఏటా నగదు రూపంలో వసూలు.. బ్రాంచీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా నల్లధనంగా తరలింపు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. మనీ లాండరింగ్‌కు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) దృష్టికి సీఐడీ తీసుకొచ్చింది. చట్టాలను ఉల్లంఘించి రామోజీరావు, ఆయన కుటుంబం పాల్పడుతున్న ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా వివరించింది. మరోవైపు సీఐడీ అధికారులు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాల్లో అక్రమ పెట్టుబడులు, చందాదారులు సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా బదిలీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధానంగా మార్గ దర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్, సంస్థ డైరెక్టర్ల పాత్రకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంస్థ బ్యాలన్స్ షీట్లు, నగదు–చెక్కు వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు, నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో వెలుగు చూసిన ఆర్థిక అక్రమాలకు మూలం అంతా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయమేనని వెల్లడైంది.



బెడిసికొట్టిన ఏ-1 రామోజీ, ఏ-2 శైలజ పన్నాగం

ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్ ఈ కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలను సీఐడీ తాజా సోదాలతో అడ్డుకుంది. ఈ నెల 3న రామోజీరావును, శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించిన విషయం విదితమే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి నిధుల మళ్లించామని అంగీకరిస్తూనే ఆ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, అంతా బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) చూసుకుంటారని ఈ సందర్భంగా రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. మరోవైపు శైలజా కిరణ్ కూడా అదే రీతిలో విచారణకు సహకరించకుండా సహాయ నిరాకరణ చేశారు.

అక్రమంగా బదిలీ చేసింది వారిద్దరే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించింది సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణేనని సీఐడీ సోదాల్లో వెల్లడైంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబానికి చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)– బెంగళూరు, మార్గదర్శి(తమిళనాడు)–చెన్నై సంస్థల్లోకి మళ్లించారు. కంపెనీ చైర్మన్ హోదాలో రామోజీరావు, ఎండీ హోదాలో శైలజతోపాటు డైరెక్టర్ల ఆమోదంతోనే ఆ నిధులు మళ్లించారనేందుకు కీలక ఆధారాలు సీఐడీకి లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు కేసు దర్యాప్తులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం.

ఆ చెక్కులు ఎక్కడ..?

ఏటా సరిగ్గా.. మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వస్తున్నట్టు మార్గదర్శి చిట్‌ఫండ్స్ తన బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తోంది. 2022 మార్చి 31న కూడా రూ.550 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్టు చూపించారు. కానీ నిర్ణీత 90 రోజుల్లోగా ఆ చెక్కులను నగదుగా మార్చడం లేదని సీఐడీ అధికారుల సోదాల్లో వెలుగులోకి వచ్చింది. చెక్కుల్లో చూపిస్తున్న నిధులను రామోజీ తన కుటుంబ ప్రయోజనాల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపైనే సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజా కిరణ్ షాక్‌కు గురయ్యారు. ఆ చెక్కులు నగదుగా మారాయో లేదో రికార్డులు తమ వద్ద లేవని చెప్పడంతో ప్రధాన కార్యాలయానికి వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించారు. అందుకు ఆమె అంగీకరించకపోగా సీఐడీ అధికారులు అక్కడకు వెళ్లేందుకు కూడా సమ్మతించలేదు. ప్రధాన కార్యాలయంలోని కీలక రికార్డులను సీఐడీ పరిశీలించేందుకు శైలజా కిరణ్ ఒప్పుకోకపోవడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు బుధవారం నిర్వహించిన సోదాల్లో ఏటా బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తున్న చెక్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అసలు చెక్కులు రావడంగానీ, వాటిని నగదుగా మార్చడంగానీ జరగడం లేదని గుర్తించారు.

నగదు రూపంలో ఏటా రూ.500 కోట్లు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏటా రూ.500 కోట్లను నగదు రూపంలో వసూలు చేస్తున్నట్లు బ్రాంచి కార్యాలయాల్లో గతంలో నిర్వహించిన సోదాల్లో వెలుగు చూసింది. కానీ ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలేదు. ఆ నగదు నిల్వలేవీ ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో కూడా లేనట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అంటే ఆ డబ్బులను నల్లధనం రూపంలో అక్రమంగా తరలిస్తున్నట్లు రూఢీ అయింది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రామోజీ బెంబేలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను సీఐడీ ఆధారాలతో సహా జాతీయ దర్యాప్తు సంస్థల దృష్టికి తేవడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. సీఐడీ దర్యాప్తుపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన తొలిసారిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట తాజాగా పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈడీ, సీబీడీటీ దర్యాప్తు తప్పదేమోనన్న ఆందోళన అందులో వ్యక్తమైంది. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యకలాపాలు నిలిచిపోయాయని ఆ ప్రకటనలో అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు ఏవీ ప్రారంభించడం లేదని పేర్కొనడం గమనార్హం.

'మార్గదర్శి' మోసాలివిగో

జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు క్షుణ్నంగా విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం సూచించింది. మనీ లాండరింగ్, నిధుల స్వాహా, కార్పొరేట్ మోసాలు, బినామీ లావాదేవీలతో పన్ను ఎగవేత లాంటి కీలక అంశాలను తమ విచారణలో కనుగొన్న నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు చేయడం అవసరమని పేర్కొంది. సీఐడీ ఏడీజీ సంజయ్ బుధవారం ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడారు. చిట్‌ఫండ్ పేరుతో జరిగిన అతిపెద్ద ఆర్థిక మోసాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అడ్డుకున్నట్లు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించిన చరిత్ర కలిగిన మార్గదర్శి చిట్ గ్రూప్ 1982 చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అమాయక చందారులను దోపిడీ చేస్తోందన్నారు. మార్గదర్శి ఉల్లంఘనలన్నీ కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్నందున రెండు రోజుల పాటు ఢిల్లీలో ఆయా విచారణ సంస్థలను కలుసుకుని వివరాలు అందచేసినట్లు చెప్పారు. మోసపూరిత ఆర్థిక సంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ప్రేక్షకపాత్ర వహించరాదని సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.



'సుప్రీం' ఏం చెప్పిందంటే...

''చిట్ ఫండ్స్ చట్టాన్ని ప్రధానంగా చందాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించారు. కొన్ని మోసపూరిత ఆర్థిక సంస్థలు చందాదారులు/డిపాజిటర్లను మోసం చేయడమే కాకుండా నిధులను పక్కదారి పట్టించడం లేదా మళ్లించడం చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కఠినచర్యలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రజల సంక్షేమానికి సంరక్షకుడిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం దీనికి పరిష్కారాన్ని కనుగొనకుండా మౌన ప్రేక్షకుడిగా ఉండరాదు'' అని శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సంజయ్ తెలిపారు.

సత్యం, సహారా, శారదా తరహాలో..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఉల్లంఘనలు, మోసపూరిత పద్ధతులు సత్యం కంప్యూటర్స్, సహారా, శారదా చిట్స్ మోసాలకు చాలా దగ్గరగా ఉన్నట్లు సంజయ్ తెలిపారు. ఈ దోపిడీని అరికట్టేందుకు మార్గదర్శి ఖాతా పుస్తకాలపై లోతైన విచారణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ దిశలోనే తమ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి వివరాలు తగిన సమయంలో వెల్లడిస్తామన్నారు.

రహస్యంగా నిధుల మళ్లింపు..

డిపాజిట్ల ద్వారా మార్గదర్శి సేకరించిన నిధులను అనుబంధ కంపెనీలు, షేర్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ లాంటి ఇతర పెట్టుబడులకు రహస్యంగా మళ్లించడంతోపాటు అధిక మొత్తంలో సభ్యత్వాలు స్వీకరిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతోందన్నారు. వడ్డీ, భద్రత అందించే పేరుతో చందాదారుల సొమ్మును మార్గదర్శి వద్దే ఉంచాలని బలవంతం చేయడం, 'చెక్స్ ఆన్‌హ్యాండ్, క్యాష్ ఆన్‌హ్యాండ్' పేరుతో నగదు నిల్వల్ని పెంచడం లాంటి మోసపూరిత అకౌంటింగ్ పద్ధతుల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈమేరకు ఎఫ్ఐఆర్‌లో ఏ–1గా మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా కంపెనీ ఎండీ శైలజా కిరణ్, ఏ–3గా బ్రాంచి మేనేజర్లు, ఏ–4గా కంపెనీ, ఏ–5గా ప్రిన్సిపల్ ఆడిటర్ కె.శ్రవణ్ పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. ఏ–1 నుంచి ఏ–5 వరకూ అందరినీ ఒక్కోసారి ప్రశ్నించినా తప్పించుకునే సమాధానాలు వచ్చాయని చెప్పారు. అవసరమైన సమాచారం, పత్రాలను చిట్ రిజిస్ట్రార్, సీఐడీకి మార్గదర్శి ఇవ్వడం లేదన్నారు.


సీఐడీ ప్రాథమిక విచారణలో ఏం తేలిందంటే...



- చిట్‌ఫండ్ చట్టంలోని పలు నిబంధనలను మార్గదర్శి గ్రూప్ ఉల్లంఘించింది.
- చందాదారుల సొమ్మును హెచ్‌యూఎఫ్ నియంత్రిత సంస్థలకు మళ్లించింది.
- చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును ఎక్కువ రిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్‌కు మళ్లించారు.
- నాలుగు నుంచి ఐదు శాతం వార్షిక వడ్డీ రేటు అందిస్తూ భవిష్యత్తు సభ్యత్వాల రసీదు ముసుగులో అక్రమ డిపాజిట్లను బలవంతంగా తీసుకుంటోంది.
- చిట్‌ఫండ్ చట్టం 1982 ప్రకారం కంపెనీ బ్యాలెన్స్ షీట్, ఖాతాల వివరాలను అందించలేదు.
- ఖాతాలకు మసిపూసి మారేడు కాయ చేస్తూ అవసరమైన సమాచారాన్ని ఇవ్వడం లేదు.
- నిందితులు విచారణకు సహకరించకుండా వివిధ మార్గాల ద్వారా సీఐడీ పరువు తీయడం, నిందలు మోపేందుకు యత్నిస్తున్నారు.

పిటిషనే లేకుండా వాదనలా?

- మార్గదర్శి మౌఖిక ప్రస్తావనను తప్పుబట్టిన ధర్మాసనం
- తనిఖీలపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న తెలంగాణ హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయకుండా మౌఖికంగా రిలీఫ్ కోరడాన్ని తప్పుబట్టింది. అప్లికేషన్ (పిటిషన్) దాఖలు చేస్తేనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది. మార్గదర్శి కేంద్ర కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలను ఆపాలని, బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టును మార్గదర్శి ఆశ్రయించింది. బుధవారం ఉదయం జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట ఈ అంశాన్ని ప్రస్తావించగా.. రోజువారీ కేసుల విచారణకు ఇబ్బంది ఎదురవుతుందని, సాయంత్రం 4.30 గంటలకు దీన్ని మెన్షన్ చేయాలని ఆదేశించారు. సాయంత్రం విచారణ ప్రారంభం కాగానే మార్గదర్శి తీరును ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి తప్పుబట్టారు. 'ఉద్యోగుల నుంచి ఎలాంటి ప్రత్యేక అప్లికేషన్ లేకుండా రిలీఫ్ పొందాలని భావించడం సరికాదు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుంది. మౌఖికంగా ప్రస్తావించే వాటిని పరిగణనలోకి తీసుకుని ఆర్డర్ ఇవ్వకూడదని గతంలో ఇదే కోర్టు ద్విసభ్య ధర్మాసనం (యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ ఎస్ఎం హుస్సేన్ రషీద్ కేసు) తీర్పునిచ్చింది. అత్యవసర పరిస్థితి అంటే.. ఉరితీత, భవనాలను కూల్చడం లాంటివి మాత్రమే. చిన్న అంశాలను మౌఖికంగా మెన్షన్ చేయడం సమర్థనీయం కాదు. తనిఖీలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికే చాలా పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వానికి కౌంటర్ వేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డర్ కోసం పట్టుబడుతున్నారు. చట్టపరంగా తనిఖీలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. తనిఖీలు కొనసాగుతున్నప్పుడు కోర్టు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు కూడా గతంలో ఆదేశించింది. తనిఖీలు పారదర్శకంగా సాగుతున్నాయి. ప్రజల నుంచి సేకరిస్తున్న నగదు నిర్వహణ నిబంధనల మేరకు జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదనే ఈ చర్యలు చేపడుతున్నాం. పిటిషనర్ చెబుతున్నట్లుగా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ఎలాంటి డేటాను దర్యాప్తు అధికారులు సేకరించడం లేదు. కేసుకు సంబంధించి డేటా మాత్రమే తీసుకుంటున్నారు. గత నెల 21న కోర్టు ఆ పిటిషన్ వేసిన వారికి మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. ఇది ఉద్యోగులందరికీ వర్తించదు' అని వాదనలు వినిపించారు. జీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఉద్యోగుల నుంచి ప్రత్యేక అప్లికేషన్‌తో రావాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ సమయంలో మార్గదర్శి తరఫు న్యాయవాది జోక్యం చేసుకునే ప్రయత్నం చేయగా.. 'ఇప్పటికే పలు పిటిషన్లలో అరెస్టు సహా బలవంతపు చర్యల నుంచి ఉపశమనం పొందారు. ఈ మౌఖిక ప్రస్తావనలో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేం. పిటిషన్ దాఖలు చేస్తేనే వాదనలు వింటాం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

జిల్లా వార్తలు

నాబార్డు ద్వారా రైతులకు చేయూత



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్

అశ్వాపురం: నాబార్డు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలతో రైతులకు చేయూతగా నిలుస్తున్నామని నాబార్డు డీడీఎం ఎల్.సుజిత్‌కుమార్ తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అశ్వాపురంలోని రైతువేదికలో నాబార్డు, చెస్టెడ్ సంస్థ ఆధ్వర్యాన బుధవారం రైతు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో డీడీఎం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాలు వచ్చాయని.. వీటిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి పెరగడమే కాక ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న, ఏడీఏలు తాతారావు, లాల్‌చంద్, ఏఓ సాయిశంతన్‌కుమార్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, ఏపీజీవీబీ మేనేజర్ ప్రభాకర్, చెస్టెడ్ సంస్థ డైరెక్టర్ ఎస్ఏఎస్‌వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకే–5షాఫ్ట్‌లో వైండింగ్ ఇంజన్ జనరేటర్



జనరేటర్ వద్ద డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్‌లో వైండింగ్ ఇంజన్ జనరేటర్ అందుబాటులోకి వచ్చింది. ఈ జనరేటర్‌ను బుధవారం సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గనికి జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు కార్మికులు గంటల పాటు గనిలో ఉండాల్సిన పరిస్థితి ఎదురయ్యేదని చెప్పారు. దీంతో ఏరియా జీఎం జక్కం రమేష్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాగా జనరేటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుధాకర్, గురవయ్యతో పాటు రవీందర్, పాలడుగు శ్రీనివాస్, ఎం.డీ.రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చలేకపోతే కాళ్లు పట్టుకుంటాం..

- ప్రజల శ్రమ, అభిమానుల రక్తంతోనే మాకు ఈ పదవులు
- బీఆర్ఎస్ సమ్మేళనంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్సీ సండ్ర, ఎమ్మెల్సీ మధు తదితరులు

పెనుబల్లి : ప్రజల కష్టాలు తీర్చలేనప్పుడు కాళ్లు పట్టుకుని దాసోహం అంటామే తప్ప కోటీశ్వరుల కాళ్లు పట్టుకోబోమని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పెనుబల్లి మండలం మండాలపాడులో బుధవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తుమ్మలతో పాటు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత ఆదర్శనీయంగా ఎదిగిందని చెప్పారు. మూడు సార్లు మంత్రిగా తాను అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశానని తెలిపారు. రాజకీయాలను తాము తపస్సులా, యజ్ఞంలా చేస్తూ.. ప్రజల శ్రమ, అభిమానులు రక్తం చిందించడంతో ప్రజాప్రతినిధులుగా ఎదిగామన్నారు. అంతేతప్ప ఎవరో దానం చేస్తే వచ్చిన బతుకులు కావని పరోక్షంగా మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సత్తుపల్లి నుండి రాజమండ్రికి, అమరావతికి రైల్వే లైన్ పూర్తయితే రైల్వే హబ్‌గా మారుతుందని, ఇప్పటికే జాతీయ రహదారులు, గ్రీన ఫీల్డ్ హైవేలతో జిల్లా స్వరూపమే మారిపోయిందని తెలిపారు. రోడ్ల విస్తరణలో కోల్పోయిన వారు తమను గతంలో నిందిచారని.. కానీ ఇప్పుడు భూముల విలువ పెరగడంతో వారు సంతోషంగా ఉన్నారని చెప్పారు. లంకాసాగర్ ప్రాంతానికి ఎన్నెస్పీ నీళ్లు ఇస్తుండగా.. త్వరలో సీతారామ ప్రాజెక్టు నీళ్లు కూడా అందుతాయని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ మాజీ సీఎం జలగం వెంగళరావు, మాజీ మంత్రి తుమ్మలపల్లి నాగేశ్వరరావు, ప్రస్తుత ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషితో సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశలో దూసుకెళ్తోందని తెలిపారు. కొందరు డబ్బుతో రాజకీయాలు చేస్తూ ఎన్నికల వేళ వస్తారని.. అలాంటి వారిని నమ్మొద్దని కోరారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తుండగా.. పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని సూచించారు. త్వరలోనే పెనుబల్లిలో రూ.రూ.8 కోట్లతో నిర్మించనున్న ఆస్పత్రి భవనానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఈ సభలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్యతో పాటు 17 గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిన బీజేపీ

- ప్రజా చైతన్యమే లక్ష్యంగా ప్రజాపోరు యాత్ర
- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాలుగా ప్రజాస్వామ్య దేశంలో కొనసాగుతున్న రాజ్యాంగ విలువలకు కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ తిలోదకాలు ఇచ్చిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు ఆరోపించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పునాదులుగా రూపుదిద్దుకున్న వ్యవస్థ ఇప్పుడు బీజేపీ కారణంగా ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేశ ఆర్థికవ్యవస్థ మోదీ విధానాలతో కుదేలైందన్నారు. సంపన్నుల కోసం మాత్రమే బీజేపీ పాలన కొనసాగుతుండగా, సామాన్యులు సమిధలు అవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన బీజేపీని ఇంటికి పంపడమే అజెండాగా వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు సీపీఐ కృషి చేస్తోందని చెప్పారు.

14 నుంచి ప్రజాపోరు యాత్ర

ఈనెల 14 నుంచి 21 వరకు ఖమ్మం జిల్లాలో సీపీఐ ఆధ్వర్యాన ప్రజా పోరు యాత్రను నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. పోడు భూమికి పట్టాలు, సీతారామ మొదలైన ప్రాజెక్టుల సత్వర నిర్మాణం, రేషన్ కార్డులు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా సమస్యల పరిష్కరించాలనే జిల్లాలోని అన్ని మండలాలు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రారంభమయ్యే యాత్ర సత్తుపల్లి, ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం, కొణిజర్ల, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో కొనసాగుతుందని తెలిపారు. ఈక్రమంలోనే 20న ఖమ్మం ముస్తఫానగర్, 21న ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురంలో నిర్వహించే భారీ బహిరంగ సభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ కుండ.. కడుపు చల్లంగుండ!



ఓఆర్ఎస్ ద్రావణాన్ని బాటిల్‌లో పట్టుకుంటున్న మహిళ

ఖమ్మం వైద్య విభాగం: ఎండలు మండిపోతున్నాయి... భానుడి భగభగతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. పనులపై బయటకు వస్తున్న వారు దాహంతో తల్లాడిపోతున్నారు. ఈక్రమంలో జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వైద్యులు వినూత్నంగా ఆలోచించి సాధారణ నీటికి బదులు ఓఆర్ఎస్ ద్రావణాన్ని కుండలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నవారు, ఓపీ సేవలు అందడానికి వచ్చిన వారు ఈ నీరు తాగి ఉపశమనం పొందుతున్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా శరీరం డీహైడ్రేషన్ కాకుండా కాపాడటమే కాకుండా శక్తిని ఇస్తుందని వైద్యులు వెల్లడించారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలి

ఎంపీ నామాను కోరిన రైతులు, సీపీఎం నాయకులు



ఎంపీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

ఖమ్మం రూరల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి మిర్యాలగూడెం వరకు నిర్మించనున్న రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్పు చేయించాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావును రైతులు, సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆధ్వర్యాన పది గ్రామాల రైతులు, సీపీఎం నాయకులు ఎంపీని బుధవారం కలిసి సమస్యను వివరించారు. కొత్త రైల్వే లైన్ ఖమ్మం జిల్లాలోని మల్లెమడుగు స్టేషన్ నుంచి ఖమ్మం రూరల్ మండలం కామంచికల్లు, రామన్నపేట పల్లెగూడెం, రెడ్డిపల్లి, ముత్తగూడెం, ఏదులాపురం, గుర్రాలపాడు, తెల్లారుపల్లితో పాటు ముదిగొండ, నేలకొండపల్లి మండలాలు, కోదాడ మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి రూ.3కోట్ల నుంచి రూ.4 కోట్ల మేర పలుకుతున్నందున, ఖమ్మం రూరల్ మండలంలో పేద, మధ్య తరగతి ప్రజలు స్థలాలు కొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అలాగే, భూములు కోల్పోయే వారిలో చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని చెప్పారు. ఈ మేరకు రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని వారు ఎంపీని కోరగా కేంద్ర రైల్వే మంత్రికి లేఖ రాస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, సిద్ధినేని కోటయ్య, తమ్మినేని వెంకట్రావు, సంగయ్య, కృష్ణ, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం – కురవి జాతీయరహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇప్పించాలని రైతు సంఘాల నాయకులు ఎంపీ నామా నాగేశ్వరరావును కోరారు.

రైల్వేలైన్ సర్వేను అడ్డుకున్న రైతులు



సర్వే బృందాన్ని అడ్డుకుంటున్న ప్రజలు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం పరిధిలో డోర్నకల్ నుండి మిర్యాలగూడెం వరకు నిర్మించనున్న రైల్వే లైన్ కోసం సర్వే చేపట్టారు. అయితే, సర్వేను రైతులు బుధవారం అడ్డుకున్నారు. ఇళ్లు కూల్చివేస్తూ పచ్చని పంటపొలాలు, నివాసస్థలాలను ధ్వంసం చేసేలా లైన్ నిర్మించడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఇకనైనా సర్వే ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించడంతో ఏజెన్సీ సంస్థ సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు.

నారపునేపల్లి విద్యార్థినికి అరుదైన అవకాశం

లోక్‌సభ సెంట్రల్ మినిస్ట్రీలో ప్రసంగించనున్న అఖిల



కనకపుడి అఖిల

వైరారూరల్: ఖమ్మం జిల్లా వైరా మండలం నారపునేనిపల్లికి చెందిన విద్యార్థిని కనకపుడి అఖిలకు అరుదైన అవకాశం దక్కింది. ఈనెల 14వ తేదీ లోక్‌సభ సెక్రటేరియట్ – పార్లమెంట్ వేదికగా సెంట్రల్ మినిస్ట్రీ పరిధిలో నిర్వహించే అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆమె ప్రసంగించనుంది. వరంగల్‌లోని చైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆమె ఖమ్మం జిల్లా ఎన్‌వైకేఎస్ సహకారంతో సెంట్రల్ మినిస్ట్రీలో ప్రసగించే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా అఖిలను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

'భక్త రామదాసు' భవనం మరమ్మతుకు అనుమతి

ఖమ్మంఅర్బన్: జలవనరులశాఖ పరిధిలో భక్త రామదాసు పథకం పనుల నిమిత్తం గతంలో కూసుమంచి మండలం ఎర్రగడ్డతండాలో భవనం నిర్మించారు. ఈ భవనం మరమ్మతులకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన జలవనరులశాఖ నిపుణుల కమిటీ సమావేశంలో రూ.8 లక్షలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. భవనంలో మరమ్మతులతో పాటు సౌకర్యాల కల్పనకు జిల్లా అధికారులు రూ.11 లక్షలతో ప్రతిపాదనలు సమర్పించారు. కానీ నిపుణుల కమిటీ మాత్రం రూ.8 లక్షలకు ఆమోదించినట్లు సమాచారం.